క్లుప్తంగా

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కు వైద్య పరీక్షలకు విచ్చేసిన గర్భిణీలకు లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. సుమారు 80 మంది గర్భిణీలకు పౌష్టికాహారాన్ని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన తాతా శ్రీరామ చంద్రమూర్తి గర్భిణులకు పౌష్టికాహారాన్ని సమకూర్చారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకట రత్నం ఆధ్వర్యంలో జరిగిన సీహెచ్‌సీ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఎం.కన్యాకుమారి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

కోటనందూరు: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అంగన్‌వాడీ సిబ్బంది సూచనల మేరకు బాలింతలు, గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, ఉల్లూరి శ్రీను, మళ్ల సూర్యచంద్ర, పంచాయతీ కార్యదర్శి రాజానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టైలర్లను ఆదుకోవాలి

కోటనందూరు: ప్రభుత్వం టైలర్లను ఆర్థికంగా ఆదుకోవాలని టైలర్ల సంఘ మండలాధ్యక్షుడు కోటిపల్లి గోవిందు కోరారు. మంగళవారం స్థానిక నూకాలమ్మ గుడి ఆవరణలో శ్రీనూకాంబిక టైలర్ సహకార సంఘ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ టైర్లంతా సంఘటితంగా ఉండి హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన కాకరాపల్లికి చెందిన అల్లూరి ప్రసాద్‌ను స్వగృహంలో టైలర్ల సంఘ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. టైలర్లు శ్రీను, నాగబాబు, రాంబాబు, మీరా, ఆదమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది పనితీరు పరిశీలన

తుని: రోడ్లపై వ్యర్థాలను విచ్చలవిడిగా వేయవద్దని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. మంగళవారం శానిటేషన్ విభాగం పనితీరును ఆయన పరిశీలించారు. పట్టణ పరిధిలోని కుటుంబాలకు ఉచితంగా డస్ట్ బిన్నులు అందించామని, అంతా వాటిని వినియోగిస్తున్నారా? లేదా అనేది శానిటేషన్ కార్యదర్శులు మేస్త్రీలు తనిఖీ చేయాలన్నారు. క్రమం తప్పకుండా సచివాలయాల పరిధిలో వారానికి మూడు రోజుల పాటు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్ ప్రాంతాల్లో చెత్త సమస్య లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా సింగరమ్మ జాతర

జగ్గంపేట: మల్లిసాల గ్రామంలో సింగరమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఐదు రోజులపాటు అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతాయి. కోయిడాన్సులు, శక్తివేషాలు, తప్పటగుళ్లు, వివిధ వేషాలు, గరగలు, భక్తుల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

వేంకటేశ్వరునికి చక్రస్నానం


కిర్లంపూడి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక మహోత్సవాల్లో బాఘంగా మంగళవారం స్వామివారికి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గోవర్ధన్ శ్రీధర్ ఆధ్వర్యంలో పెంటకోట నాగబాబు, సత్యవేణి దంపతుల పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గండేపల్లి: తాళ్లూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి శ్రీపుష్ప యాగం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామివారి పవళింపు సేవ అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఈ ఘట్టంతో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ముగిశాయి.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

తుని: స్థానిక కొండవారిపేట రావిచెట్టు వద్ద సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని పట్టణ సీఐ నాగ దుర్గారావు తెలిపారు. మంగళవారం అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా అనుకూల నూకరాజు సారా విక్రయిస్తున్నట్టు గుర్తించి, అతని నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబుకి నగదు అందజేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

గోకవరం: అరుదైన సీజీడీవ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబుకు ముప్పిడి కళ తదితరులు అందజేశారు. ఆ నగదును బాధిత కుటుంబానికి అందించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బత్తుల నానాజీ, ముమ్మిడివరపు చినబాబు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆమె ధైర్యం.. పలువురికి ఆదర్శం..

- అన్నింటా ముందున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళలు ఆలిగా.. తల్లిగా.. చెల్లిగానే కాకుండా ఉద్యోగ, వ్యాపారాల్లో మగవారితో సమానంగా ప్రతి రంగంలోనూ ముందుంటున్నారు. ధైర్యంగా ముందుకు సాగి వారి కుటుంబాలను పోషించుకోవడమే కాకుండా మరి కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొంత మంది మహిళల విజయాలు తెలుసుకుందాం..

ఏలేశ్వరం: మహిళలు వంటింటికి పరిమితం కాదని తమ కాళ్లపై నిలబడి ముందుకు సాగాలని లక్ష్యంతో మహిళలకు చేయూతనిస్తోందని సత్యలక్ష్మీప్రసన్న. మహిళలకు చదువు లేకపోయినా చేతి వృత్తుల ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ పలువురి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఏలేశ్వరం పట్టణానికి చెందిన శేషపల్లి సత్యలక్ష్మీప్రసన్న 2011లో శ్రీజ ఎడ్యుకేషనల్ వేల్ఫేర్ సొసైటీ స్థాపించి ప్రభుత్వ సహకారంతో మహిళలకు ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పేదరిక నిర్మూలన, జీవనోపాధి, జీవన నైపుణ్యాలు మెరుగుపరచడం వంటి అంశాలపై వారికి శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్కు, కంప్యూటర్ కోర్సులు, స్పోకెన్ ఇంగ్లిష్, చేనేత కళాకారులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఇప్పటివరకూ పది వేల మందికి శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది సుమారు 60 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఎటువంటి రుసుం లేకుండా మహిళలకు అన్నిరంగాల్లో శిక్షణ ఇస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.



శిక్షణపై అవగాహన కల్పిస్తున్న సత్యలక్ష్మీప్రసన్న

కిర్లంపూడి: మండల కేంద్రమైన కిర్లంపూడి, పాలెం, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు మహిళలు మగ్గం (ఎంబ్రాయిడరీ వర్క్‌లో తమ ప్రతిభను కనబరుస్తు ముందుకు సాగుతున్నారు.

కవితల్లో దిట్ట

జగ్గంపేట: జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మంచాల శ్రీలక్ష్మి కవితలు రాయడంలో దిట్ట. ఆమె రాసిన కవితలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, తెలంగాణలోను పలు సంస్థల ద్వారా అనేక బిరుదులు లభించాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మెదక్ జిల్లా ఏడుపాయల మల్లినాథ సూరి కళాపీఠం వారి 105 అంశాలతో వివిధ కవితా ప్రక్రియలలో రాసినందుకు ఆమెకు కళాపీఠం నుంచి కవిచక్రవర్తి, కవిచక్ర, సారస్వత మంజీరా, కవన సఖిన వల్లభ బిరుదులు లభించాయి. మేకా రవీంద్ర సహస్ర కవిమిత్రలో కవితలు రాసినందుకు సహస్ర కవి మిత్ర, కవన నక్షత్రం బిరుదలతో సన్మానించారు. శ్రీలక్ష్మి పదోతరగతి చదువుతున్నప్పుడే చెలిమి సంస్థచే జాతీయస్థాయి కవితల పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. ఇప్పటి వరకూ 800 కవితలు రాసినట్టు శ్రీలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌గా తన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నారు.



సరస్వతీ పీఠం వద్ద నిర్వహించిన ఆత్మీయ కవి సమ్మేళనంలో శ్రీలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

> **చేతి వర్కే జీవనాధారం**
>
> 
>
> మగ్గం వర్కే మా కుటుంబానికి జీవనాధరమైంది. తండ్రి లేకపోవడంతో నన్ను, మా తమ్ముడుని మా తల్లి ఎంబ్రాయిడరీ వర్క్ చేసి వచ్చిన డబ్బులతో మమ్మల్ని పోషించేది. రానురాను కుటుంబం గడవడం కష్టం కావడంతో చదువు మధ్యలో ఆపేసి నేను కూడా అమ్మతో పాటు మగ్గం ఎంబ్రాయిడరీ నేర్చుకున్నాను. ప్రస్తుతం అందరు ఎంబ్రాయిడరీ డిజైన్ వర్క్‌పై ఎక్కువ మక్కువ చూపిస్తుండడంతో నేను మగ్గం వర్క్‌లో తర్ఫీదు పొంది ఎంబ్రాయిడింగ్ డిజైన్‌పై పట్టు సాధించాను. కిర్లంపూడిలో సొంతంగా మగ్గం వర్క్ మొదలపెట్టాను. వినియోగదారులు ఇస్తున్న డబ్బులకు నాణ్యమైన వర్క్ చేయడంతో నాకు మంచి ఆధారణ లభిస్తుంది. ప్రస్తుతం నా దగ్గర 15మంది వర్క్ చేస్తున్నారు. నా తమ్ముడుని బాగా చదివించుకుంటూ 15 మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది.
>
> –షేక్ ఫాతిమా, మగ్గం ఎంబ్రాయిడరీ డిజైన్ వర్క్ నిర్వాహకురాలు

ఏపీలో భారీగా పెట్టుబడులు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవ సంబరాలు

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పారిశ్రామిక విధానానికి ఆకర్షితులైన పెట్టుబడుదారులు ఆంధ్రప్రదేశ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన శంఖవరంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవ సంబరాల్లో భాగంగా పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దారన్నారు. 20 రంగాల్లో రూ.13 లక్షల కోట్లకు పైగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. మన రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పర్వత రాజుబాబు, గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీలు గొల్లు చిన్న దివాణం, బెహరా రాజ్యలక్ష్మి, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, పార్టీ కన్వీనర్లు సరాల శ్రీను, జిగిరెడ్డి శ్రీను, బెహరా దొరబాబు, కాకినాడ బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు శెట్టిబత్తులు కుమార్‌రాజా, ఎస్టీసెల్ అధ్యక్షుడు చింతల రాజు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్లు నక్కా అశ్విని, దలే చిట్టిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు



డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మైథిలి



ఎంపీ, కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న తొండంగి మహిళమార్టు ప్రతినిధులు



గుంటూరులో పురస్కారం అందుకుంటున్న తొండంగి సీసీ ఝాన్సీలక్ష్మి

తొండంగి: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. మండల మహిళా సమాఖ్యలో ఉత్తమ సేవలందిస్తున్న సీసీ ఝాన్సీలక్ష్మికి అవార్డు లభించింది. మంగళవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఉన్నతాధికారుల నుంచి ఝాన్సీలక్ష్మి అవార్డు అందుకుంది. అలాగే ఆర్థిక స్వావలంబన సాధించిన స్థానిక మండల మహిళ మార్టు ప్రతినిధులు ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

జిల్లా ఉత్తమ కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా మైథిలి

తుని రూరల్: కొలిమేరు క్లస్టర్ సీసీగా పని చేస్తున్న మైథిలి వైఎస్సార్ క్రాంతి పథం కాకినాడ జిల్లా ఉత్తమ కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం సామర్లకోటలో జరిగిన మహిళా దినోత్సవం ప్రత్యేక కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరమణి నుంచి ఆమె అవార్డు అందుకున్నారు. సీసీగా వివిధ గ్రామాల్లో మహిళలను చైతన్యపర్చడంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డు లభించిందని ఏపీఎం వై.సత్తిబాబు తెలిపారు. అవార్డు పొందిన మైథిలీని సహచరులు అభినందించారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడి

రౌతులపూడి: ప్రస్తుతం జీడిమామిడి రైతులంతా తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్.పైడిపాల సమీపంలోని జీడిమామిడి రైతులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రస్తుతం తోటల్లో పూత నూగు తెగులు ఆశించిందని, నివారణకు ఒక లీటరు నీటిలో క్లోరిఫైరిపాస్ రెండు మిల్లీలీటర్ల మందును, కార్బండజిమ్ ఒక గ్రామ పొడరును కలిపి పిచికారీ చేయాలన్నారు. నేల స్వభావాన్ని బట్టి 15, 20 రోజుల వ్యవధిలో చెట్లకు నీరుపెట్టాలన్నారు. దీని వల్ల పిక్కలు రాలుడం తగ్గి సైజు బాగా పెరుగుతుందన్నారు. రైతులు ఎవరికైనా డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం అవసరమైతే రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొల్లు వెంకటరమణమూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

గోకవరం: రైతులు పండ్ల తోటల్లో సస్యరక్షణ చేపట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ ఎం.మాధవి అన్నారు. రూరల్ హార్టీకల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం విద్యార్థులతో వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయ చేస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.చెన్నకేశవులు, పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు కె.రాజేంద్రప్రసాద్, పి.లలితకామేశ్వరి, ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి అరుణ్‌కుమార్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

ఏలేశ్వరం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కేవీ సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కుక్కల బెడద తగ్గించేందుకు చేపట్టిన గర్భనియంత్రణ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎస్ వరలక్ష్మికి సహకరించాలన్నారు. అలాగే నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

శాస్త్రోక్తంగా సుదర్శన, చండీ హోమాలు

తుని రూరల్: లోవదేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి మహాచండీ హోమం, ఎస్.అన్నవరంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని లోవ దేవస్థానంలో వేదపండితులు అమ్మవారికి విశేషంగా మహాచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఎస్.అన్నవరంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో అర్చకులు సుదర్శన హోమం చేసి, పూర్ణాహుతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

తుని: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని అమర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దల్లి అమర్నాథ్ అన్నారు. మంగళవారం తుని పట్టణం నాలుగో వార్డు కొండవారిపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కౌన్సిలర్ తమ్ములపల్లి సుశీల, మాజీ కౌన్సిలర్ చితకల రత్నకుమారి, ఉదయ రేఖా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, వలంటీర్లును ఘనంగా సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని అమర్నాథ్ కోరారు. దల్లి శ్యాంసన్, నాయకులు పాల్గొన్నారు.



తునిలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

మహిళలకు సత్కారం

తుని రూరల్: మండల పరిషత్‌లో మహిళా ఉద్యోగులను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను మండల పరిపాలన అధికారి ఎంఎస్‌వీఎస్ శేషగిరిరావు, ఈఓపీఆర్‌డీ ఎస్.జయరామ్‌లు పూల బోకేలు, పండ్లు ఇచ్చి సత్కరించారు. సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా పూర్ణిమ

కిర్లంపూడి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా నియమితులైన ఎం.పూర్ణిమ మంగళవారం వీరవరంలో జెడ్పీటీసీ తోట సత్యవతి, ఎంపీపీ తోట రవిలను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన పూర్ణిమ పదోన్నతిపై జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా వచ్చారు.

ఈఎండీపీ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోకవరం: మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయురాలు కె.ఝాన్సీ ఆధ్వర్యంలో తయారు చేసిన లో కాస్ట్ మంకీ స్కేరర్ డివైజ్ ప్రాజెక్టు ఈఎండీపీకి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయిని ఝాన్సీని అభినందించారు.



ఈఎండీపీకి ఎంపికైన లో కాస్ట్ మంకీ స్కేరర్ డివైజ్ ప్రాజెక్టుతో విద్యార్థులు

జెడ్పీటీసీ పోలింగు కేంద్రాల ప్రచురణ

కోటనందూరు: జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలింగు కేంద్రాలను ప్రచురించారు. మండల వ్యాప్తంగా 40 పోలింగు స్టేషన్లు ఉన్నాయని, అన్ని రాజకీయ పక్షాలకు ఈ స్టేషన్లపై ఎటువంటి అభ్యంతరాలున్నా తెలియజేయవచ్చని కోరారు. పోలింగు కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ఫోన్‌లో కోరారు.

జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా రాజబాబు

జగ్గంపేట: స్థానిక సీనియర్ వైఎస్సార్ సీపీ నేత పెద్దాడ రాజబాబు (బేకరిబాబు)ను పార్టీ అధిష్ఠానం జిల్లా పదవికి ఎంపిక చేసింది. కాకినాడ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియిమిస్తూ వైఎస్సార్ సీపీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల శుభాకాంక్షలు తెలిపారు.

హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కిర్లంపూడి: హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. వివరాలలోకి వెళితే... గోనేడ గ్రామంలో సోమవారం అరటా వెంకటరమణపై హత్యయత్నానికి పాల్పడిన తోటకూర స్వామి పరారీలో ఉన్నాడు. మంగళవారం గోనేడలో ఏలేరు బ్రిడ్జి వద్ద ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీసులు మాటు వేసి చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రత్తిపాడు కోర్టుకు తరలించగా నిందితుడిని ప్రత్తిపాడు సబ్‌స్టేషన్‌కు రిమాండ్‌పై తరలించినట్టు ఎస్సై రఘునాథరావు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొనడంతోనే మోటారుసైకిలిస్టు మృతి

గండేపల్లి: స్థానిక జాతీయ రహదారిపై నీలాద్రిరావుపేట శివారులో వాటర్ ట్యాంకు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ట్రాక్టర్ ఢీకొట్టడం వల్లే మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కడియం మండలం మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎలంశెట్టి వెంకన్న(41)(వీరబాబు), ఆయన అల్లుడు ఉగ్గిన రామకృష్ణ పని నిమిత్తం మోటారుసైకిల్‌పై విశాఖ వెళ్లి తిరిగి వస్తుండగా నీలాద్రిరావుపేట శివారుకు వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు నుంచి జెడ్ రాగంపేట వెళ్లేందుకు రోడ్డు దాటుతు ట్రాక్టర్ ఈ మోటారుసైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకన్న తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలతో ఉన్న రామకృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందాడని, ప్రస్తుతం అతని పరిస్థితి మెరుగ్గా ఉందని పోలీసులు తెలిపారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

ఫల సాయం టెండర్ రద్దు

శంఖవరం: మండలంలోని వజ్రకూటం, నెల్లిపూడి, కత్తిపూడి పంచాయతీల పరిధిలో అడవీ శాఖకు చెందిన 130.9 హెక్టర్లలో ఉన్న 7,855 జీడీమామిడి ఫల సాయం నిమిత్తం నిర్వహించిన టెండర్ ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. టెండర్‌లో పాల్గొన్న సకురు నాగేశ్వరరావు తక్కువ కోటేషన్‌కు టెండర్ వేయడంతో ఈ ప్రక్రియ డీఎఫ్‌ఓ ఇందుకూరి కాశీ విశ్వనాథరాజు ఆదేశాల మేరకు నిలిపివేసినట్టు కత్తిపూడి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆనంద్ తెలిపారు. మళ్లీ టెండర్ ప్రక్రియ ఎప్పుడు నిర్వహించేది చెబుతామన్నారు.

మహిళల రక్షణకు కృషి

జగ్గంపేట: మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ అన్నారు. కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం దిశ చేతన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం దిశయాప్, పోలీసుస్టేషన్లు తదితర చర్యలను తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మహిళాపోలీసులు, పాఠశాల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలబాలికల మధ్య సోదరభావం పెరగాలి

జగ్గంపేట: బాలబాలికల మధ్య సోదర భావం పెరగాలని, దీని కోసం వారి ఆలోచన విధానంలో మార్పులు తేవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగ్గంపేట తహసీల్దార్ బి.శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో మంగళవారం ప్రిన్సిపాల్ చంద్రనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవదళ్ కార్యదర్శి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒమ్మి రఘురాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.